నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, బుధవారం 17 జూలై 2024 | MEDAK

హైదరాబాద్‌లో స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు,సునీతా లక్ష్మారెడ్డి, చింతాప్రభాకర్, తదితరులు

కల్యాణలక్ష్మి చెక్కులు అందించాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఎమ్మెల్యేల విజ్ఞప్తి

కోహీర్, జూలై 16: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావుతో కలిసి హైదరాబాద్‌లోని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో 900మందికిపైగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయన్నారు. వారికి ఏడు నెలలుగా అందజేయకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెక్కుల పంపిణీ విషయంలో కలెక్టర్, ఆర్డీవోకు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేదన్నారు. వారు అనేక కారణాలు చెబుతూ పంపిణీని వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే చెక్కులు పంపిణీ చేసేలా చూడాలని, ప్రొటోకాల్ పాటించాలని స్పీకర్‌ను కోరారు.

భక్తిశ్రద్ధలతో అఖండ భగవన్నామ స్మరణ

పాండురంగాశ్రమంలో ఘనంగా ఆషాఢ ఉత్సవాలు

శ్రీపాండురంగాశ్రమం తొలిపూజలో పాల్గొన్న భక్తులు

మర్కూక్, జూలై 16 : సిద్దిపేట జిల్లా మర్కూక్‌లోని పాండురంగాశ్రమంలో ఆషాఢ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పాండురంగ స్వామికి క్షీరాభిషేకాలు,లక్ష పుష్పార్చన నిర్వహించి మూడురోజల పాటు జరిగే అఖండ భగవన్నామ స్మరణను ప్రారంభించారు. ద్వాదశి పురస్కరించుకొని గురువారం ఉదయం నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనాధిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం చాటల ద్వారా అన్నప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు.

ఓపీ సేవలకే పరిమితం..!

గజ్వేల్‌లో నూతనంగా నిర్మించిన మాతా శిశు దవాఖాన

- గజ్వేల్‌లోని మాతాశిశు దవాఖానలో అందని ప్రసూతి సేవలు
- రూ.34.22 కోట్లతో అందుబాటులోకి నూతన భవనం
- సామగ్రి లేక జిల్లా దవాఖానలో ప్రసూతి సేవలు
- రోగుల రద్దీతో ఇబ్బందులు
- మంత్రి దామోదర పట్టించుకోవాలని ప్రజల విజ్ఞప్తి

గజ్వేల్, జూలై 16: ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్ పట్టణంలో రూ.34.22 కోట్లతో మాతాశిశు దవాఖానను ఏర్పాటు చేసింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన మాతాశిశు దవాఖానలో కేవలం ఓపీ సేవలు మాత్రమే అందుతున్నాయి. గర్భిణులకు ప్రతిరోజు ఓపీ సేవలను అందిస్తూ వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారు. కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మించిన దవాఖానలో ప్రస్తుత ప్రభుత్వం వసతులు కల్పించకపోవడంతో పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. కేవలం ఓపీ సేవలకే పరిమితమవుతున్నది. గతేడాది అక్టోబర్‌లో అప్పటి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాతాశిశు దవాఖానను ప్రారంభించారు. దవాఖాన ప్రారంభించి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రసూతి సేవలు అందుబాటులోకి రాలేదు. మాతాశిశు దవాఖానను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి అధికారులు పట్టించుకోవడం లేదు. నూతన దవాఖానలో ఓటీ, లేబర్‌రూంలో కావాల్సిన పరికరాలు పూర్తిస్థాయిలో సమకూర్చలేదు. దీంతో ప్రసూతి సేవలకు గజ్వేల్‌లోని జిల్లా దవాఖానకు వెళ్లక తప్పడం లేదు. ప్రసూతి వైద్యం కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉండాలనే ఉద్దేశంతో నిర్మించిన మాతాశిశు దవాఖానలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న జిల్లా దవాఖానలోనే ప్రసూతి వైద్యం అందిస్తున్నారు. ప్రతినెలా జిల్లా దవాఖానలో 300 పైచిలుకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇదే దవాఖానకు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి గర్భిణులు పరీక్షల కోసం వస్తున్నారు. దీంతో దవాఖానలో రద్దీ ఎక్కువగా ఉంటున్నది. నూతనంగా నిర్మించిన మాతాశిశు దవాఖానలో సరిపడా పరికరాలను సమకూర్చడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఉమ్మడి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో మాతాశిశు దవాఖానను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మాతాశిశు దవాఖానలో కావాల్సిన పరికరాల కోసం ఇప్పటికే పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరికరాలను అందజేసేందుకు సుముఖత చూపించారు. ఈ నెలాఖరులో ప్రసూతి దవాఖానలో సరిపడా పరికరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

-సాయికిరణ్, సూపరింటెండెంట్ గజ్వేల్ ఎంసీహెచ్

కాంగ్రెస్‌లో గూడెం సెగ

- మహిపాల్‌రెడ్డి చేరికపై కాటా అసంతృప్తి
- మింగుడపడని అధిష్టానం నిర్ణయం
- కాటా, మహిపాల్‌రెడ్డి మద్దతుదారుల మధ్య సోషల్ వార్

సంగారెడ్డి జూలై 16(నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరటం ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిష్టానం నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన మహిపాల్‌రెడ్డిని పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీముఖ్యంగా కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తుంది. అందుకే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమానికి కాటా శ్రీనివాస్‌గౌడ్ దూరంగా ఉన్నారు. కాటా వర్గానికి చెందిన నాయకులు బాహాటంగానే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై కాటా, మహిపాల్‌రెడ్డి అనుచరుల మధ్య సోషల్ మీడియా వేదికగా రెండురోజులుగా వార్ కొనసాగుతున్నది. రెండురోజులుగా కాటా తన అనుచరులు, మద్దతుదారులతో కీలక చర్చలు జరుపుతూ తన భవిష్యత్ రాజకీయ విషయమై కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం సాగుతుంది. మరోవైపు కాంగ్రెస్ సైతం మహిపాల్‌రెడ్డిని ఇబ్బందులుకు గురిచేసే ప్రయత్నం చేసింది. మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి నడుపుతున్న క్రషర్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరిపిందని కేసు నమోదు చేయటంతోపాటు అరెస్టు చేసింది. ఆ సమయంలోనే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం సాగింది. అయితే మంత్రి దామోదర రాజనర్సింహ మహిపాల్‌రెడ్డి చేరికను అడ్డుకున్నట్లు తెలిసింది. పటాన్‌చెరులో ఎమ్మెల్యేగా ఓడిపోయిన కాటా శ్రీనివాస్‌గౌడ్ సైతం మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడాన్ని వ్యతిరేకించారు.

నీళ్లులేక కళ తప్పిన సింగూరు కాల్వలు

ఆవిరవుతున్న రైతుల ఆశలు

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు

- ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటి మట్టాలు
- డెడ్‌స్టోరేజీ దిశగా నల్లవాగు ప్రాజెక్టు
- సింగూరు నుంచి సాగునీటి విడుదల లేనట్టే..
- సింగూరు ప్రాజెక్టులో ఉన్నది 13 టీఎంసీలే..
- తాగునీటి అవసరాలకు సరిపడనున్న జలాలు
- సంగారెడ్డి జిల్లాలో ఖాళీగా దర్శనమిస్తున్న చెరువులు, కుంటలు
- నాలుగు చెరువుల్లో మాత్రమే నిండుగా నీళ్లు
- వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన

సంగారెడ్డి (నమస్తే తెలంగాణ)/ పుల్కల్, జూలై 16 : సంగారెడ్డి జిల్లా రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వానకాలం రైతులకు కలిసి రావటం లేదు. వర్షాలు లేక జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టగా వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయిలో పడిపోతుండటం రైతులను మరింత కలవరపెడుతున్నది. జిల్లాలోని సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు ఆందోళకర స్థాయిలో తగ్గుముఖం పడుతున్నాయి. నల్లవాగు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నది. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టుల్లో 13.565 టీఎంసీల జలాలు మాత్రం ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న జలాలతో తాగునీటి అవసరాలు మాత్రమే తీరుతాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేసే అవకాశాలు లేవు. కొద్దిరోజులుగా సింగూరు ప్రాజెక్టు కింద ఉన్న రైతులు సాగునీరు విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రాజెక్టు నిండితే తప్ప సాగునీరు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని చెరువులు, కుంటలు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గతేడాది వానకాలంలో నీటితో కళకళలాడిన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ప్రస్తుతం ఖాళీగా కనిపిస్తుండంతో రైతులు కలవరపడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో కొద్దిరోజులుగా వర్షాలు కురవడం లేదు. జూన్‌లో సంగారెడ్డి జిల్లాలో మొత్తం 13.9 సెం.మీటర్ల సాధారణ వర్షం కురవగా, జూలైలో ఇప్పటివరకు 6.6 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నెలలో ఇప్పటివరకు 9.1 సెం.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 6.6 సెం.మీటర్ల వర్షం కురిసింది. 27శాతం తక్కువ వర్షపాతం నెలకొంది. దీంతో జిల్లాలో వానకాలం పంటల సాగు ఆశాజనకంగా సాగడం లేదు.

సింగూరు నుంచి సాగు నీటి విడుదల లేనట్టే..

సంగారెడ్డి జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు అయిన సింగూరులో జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రాజెక్టులో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సింగూరు జలాలు వాడే పరిస్థితి ఉంది. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో సగం జలాలు అంటే 13.565 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. సింగూర ప్రాజెక్టు కింద 40వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. పుల్‌కల్, చౌటకూరు, అందోలు మండలాల్లోని రైతులు కాల్వలు, చెరువుల కింద వరి సాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. వర్షాభావం కారణంగా చెరువుల్లో నీళ్లు లేవు. వర్షాలు లేకపోవడంతో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయి. దీంతో ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు సింగూరు నుంచి కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల జలాలు ఉన్నందున కాల్వల ద్వారా సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రాజెక్టులో కనీసం నీటి మట్టం 16 టీఎంసీలకుపైగా చేరుకుంటేనే సాగునీటిని విడుదల చేసే అంశాన్ని నీటిపారుదల శాఖ పరిశీలించే అవకాశాలు ఉన్నాయి.

డెడ్ స్టోరేజీ దిశగా నల్లవాగు ప్రాజెక్టు..

సంగారెడ్డి జిల్లాలోని నల్లవాగు ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నది. సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు కింద 6వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్నది. నల్లవాగు ప్రాజెక్టు కింద ఉన్న రైతులు వరి సాగు చేసేందుకు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. అయితే ప్రస్తుతం నల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టాలు ఆందోళకర స్థాయిలో పడిపోయాయి. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1493 ఫీట్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1479 ఫీట్ల జలాలు ఉన్నాయి. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ లెవల్ 1475 ఫీట్లు. మరో నాలుగు ఫీట్లు జలాలు తగ్గితే నల్లవాగు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ చేరుకోనుంది. ఇదే జరిగితే ప్రాజెక్టు కింద వరి సాగుకు సిద్ధమైన రైతులకు సాగునీటి ఆశలు ఆవిరికానున్నాయి.

నాలుగు చెరువులు మాత్రమే నిండుగా..

సంగారెడ్డి జిల్లాలోని చెరువులు, కుంటలు నీళ్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 1769 చెరువులు ఉండగా, నాలుగు చెరువులు మాత్రమే నిండు గా ఉన్నాయంటే జల వనరుల పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. 1425 చెరువుల్లో 25శాతం నీళ్లు మాత్రమే ఉన్నాయి. 300 చెరువుల్లో 50శాతంలోపు నీళ్లు ఉన్నాయి. 40 చెరువుల్లో మాత్రమే 50 నుంచి 75శాతం నీళ్లు ఉన్నాయి. నాలుగు చెరువులు నిండుగా ఉండగా వానకాలంలో ఒక్క చెరువు అలుగు పారకపోవటం గమనార్హం. దీంతో రైతులు ఎలాంటి కాలం వచ్చిందని మదనపడుతున్నారు.

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

సింగూరు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. ఆశించినంతగా వర్షాలు పడడం లేదు. పంటలు వేసేదెట్లా. వేసిన తుకాలు ఎండిపోతున్నాయి. తొందరగా నీటిని విడుదల చేస్తేనే నార్లను బతికించుకుంటాం. నాట్లు వేసుకుంటాం. లేదంటే మా బతుకులు ఆగమైతయి. కాంగ్రెసోళ్లు రైతులను కనికరించి నీటిని విడుదల చేయాలి.

- మైసన్నగారి మాణయ్య, రైతు, పుల్కల్

రైతులను మంత్రి పట్టించుకోవాలి

బోరుబావుల వద్ద వేసిన పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి ఉంది. సక్రమంగా నీళ్లందక నారుమడులు ఎండిపోతున్నాయి. కెనాల్ నీటిని విడుదల చేస్తేనే పంటలు పండుతాయి. సింగూరు కెనాల్‌ను నమ్ముకొని రైతులందరూ నార్లు పోసుకున్నారు. ఇప్పటివరకు రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేసేలా చొరవ చూపించాలి.

- పెద్దగొల్ల విజయ్‌కుమార్, రైతు, ముద్దాయిపేట

తక్షణమే సాగునీరు విడుదల చేయాలి

రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే సింగూరు కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలి. ఈ ప్రాంతానికి చెందిన దామోదర రాజనర్సింహ మంత్రిగా ఉన్నా నీటి విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావడం లేదు. రైతుల బాధలు మంత్రికి పట్టవా. వెంటనే సింగూరు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- చంటి క్రాంతికిరణ్, మాజీఎమ్మెల్యే, అందోల్

నిబద్ధతకు మారుపేరు కేసీఆర్

సిద్దిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట, జూలై 16: నిబద్ధతకు మారుపేరు కేసీఆర్ అని బీఆర్ఎస్వీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కొలువై ఉన్న కేసీఆర్ ప్రతిరూపాన్ని కుట్రలు, అక్రమ కేసులతో తుడిచివేయలేరని, సుప్రీం కోర్టు తీర్పు దానికి నిలువెత్తు నిదర్శనమని సిద్దిపేట పట్టణ సోషల్‌మీడియా కన్వీనర్ కర్రోళ్ల సతీశ్, బీఆర్ఎస్వీ పట్టణ అధికారప్రతినిధి మెరుగు మాధవ్, ప్రధానకార్యదర్శి వంశీ అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ విద్యుత్ ఒప్పంద విచారణ కమిషన్ చైర్మన్ నర్సింహారెడ్డిని తొలిగించాలని వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపదెబ్బ అన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి సబ్బండ వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి కేసీఆర్ అని, వ్యక్తిగతంగా కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పదేండ్లలో తెలంగాణను దేశంలో అత్యున్నత స్థానంలో నిలబెట్టారని, దానిని తుడిచివేయడానికి ప్రయత్నం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. కేసీఆర్ ముందుచూపుతోనే నేడు తెలంగాణలో విద్యుత్ కోతలు లేవన్నారు. న్యాయం తమ వైపు ఉన్నందున ధర్మబద్ధంగా వ్యవహరిస్తున్నామని, బీఆర్ఎస్ కార్యకర్తల సహనానికి పరీక్ష పెట్టొద్దన్నారు.

550 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నారాయణఖేడ్: పట్టుకున్న రేషన్ బియ్యం లారీలతో పోలీసులు, నిందితులు

నారాయణఖేడ్, జూలై 16: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు అక్రమంగా తరలిస్తున్న 550 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నారాయణఖేడ్ పోలీసులు పట్టుకున్నారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం..నిజాంపేట్ శివారులోని 161 జాతీయ రహదారిపై మంగళవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రోడ్డు పక్కన అనుమానాస్పదంగా నిలిపిన రెండు లారీలను సోదా చేశారు. లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్టు తేలడంతో స్థానిక పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌కుమార్ ద్వారా పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. లారీల్లో 55 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని నారాయణఖేడ్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని చెప్పారు. లారీ డ్రైవర్లు జుబేర్, బాలాజీలను అరెస్టు చేసి యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాల్‌కల్‌లో 15క్వింటాళ్లు..

న్యాల్‌కల్, జూలై 16: మండలంలోని చాల్కి చౌరస్తాలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు, హద్నూర్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చౌరస్తాలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా టెంపోలో అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 15 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని దిగ్వాల్‌లోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించినట్లు ఎస్ఐ రామానాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గుంతల మయంగా మారిన ఉప్పర్‌పల్లి,దౌల్తాబాద్ రోడ్డు దుస్థితి

- గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- చిన్నపాటి వర్షాలకు చిత్తడిగా మారుతున్న రహదారి
- గుంతలరోడ్డును బీటీగా మార్చాలని గ్రామస్తుల విజ్ఞప్తి
- సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌కు రావాలంటేనే నరకయాతన

అధ్వానంగా ఉప్పర్‌పల్లి రహదారి

రాయపోల్, జూలై 16: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఉప్పర్‌పల్లి నుంచి దౌల్తాబాద్‌కు రావాలంటేనే గ్రామస్తులు జంకుతున్నారు. ఉప్పర్‌పల్లి నుంచి దౌల్తాబాద్ మండల కేంద్రానికి వెళ్లాలంటే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది.దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప్పర్‌పల్లి-దౌల్తాబాద్ రోడ్డు మరమ్మతులకు రూ.కోటి 7లక్షలు మంజూరు చేసింది. ఉప్పర్‌పల్లి గ్రామస్తులు అప్పటి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కానీ నేటి వరకు రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్లను రద్దు చేసింది. దీంతో 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉప్పర్‌పల్లి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలి

ఉప్పర్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డును బీటీగా మార్చాలి.ప్రభుత్వాలు మారినా ఉప్పర్‌పల్లి రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. ఉప్పర్‌పల్లి నుంచి మండల కేంద్రానికి రావాలంటే గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుల కోసం ఎక్కడికైనా వెళ్లాలంటే గుంతల రోడ్డు, చిన్నపాటి వర్షాలకు మొత్తం అస్తవ్యస్తంగా మారుతుంది. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించగా బీటీరోడ్డు కోసం నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్లను రద్దు చేసింది. ప్రభుత్వం స్పందించి ఉప్పర్‌పల్లి -దౌల్తాబాద్ మండల కేంద్రానికి వచ్చే రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

-చిత్తరిగౌడ్, మాజీ సర్పంచ్ ఉప్పర్‌పల్లి, దౌల్తాబాద్ మండలం